సాక్షి శ్రీకాకుళం

గురువారం । 5 । డిసెంబర్ । 2024



రారండోయ్.. వేడుక చూద్దాం!

పీర్లకొండ యాత్ర మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. విభిన్న సంస్కృతుల కలయికకు చిరునామాగా మారుతోంది.

- 4లో



పొట్టకొట్టే ఎయిర్‌పోర్టులు వద్దు

తమ పొట్టకొట్టే ఎయిర్ పోర్టులు వద్దని ఉద్దాన ప్రాంత రైతులు నినదించారు. ఈ మేరకు ఒంకులూరులో బాధిత గ్రామాల రైతులు ఆందోళన చేపట్టారు.

- 4లో

పశువుల అక్రమ రవాణా అడ్డగింత

కాశీబుగ్గ : పలాస మండలం కొబ్బరిచెట్లూరులో జాతీయ రహదారిపై పశువుల అక్రమ రవాణాను కాశీబుగ్గ పోలీసులు అడ్డుకున్నారు. రెండు వాహనాలలో 11 పశువులు పట్టుబడ్డాయి. వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ మోహనరావు తెలిపారు.

న్యూస్‌రీల్

ఖైదీలకు న్యాయ సహాయం



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఎ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందించాలని, లీగల్ ఎయిడ్ సిస్టం బలోపేతం కావాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. బుధవారం జిల్లా న్యాయ సేవాసదన్‌లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ సభ్యులు కక్షిదారులకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. ముద్దాయిల బెయిల్ పిటిషన్లపై దృష్టి సారించాలన్నారు. అనంతరం జరిగిన ప్రీ లోక్ అదాలత్‌లో రెండు కేసులను రాజీ చేశారు.

రెవెన్యూ సదస్సులకు పటిష్ట ఏర్పాట్లు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రెవెన్యూ సదస్సులకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సంబంధించి మంత్రి అనగాని సత్యప్రసాద్ బుధవారం విజయవాడ నుంచి కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జిల్లా రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 6 నుంచి జనవరి 8 వరకు నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. జిల్లాలోని 1464 రెవెన్యూ గ్రామాలకు గాను 738 చోట్ల రీసర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. సదస్సులకు సంబంధించి ముందుగా కరపత్రాలు పంపిణీ చేసి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఏఓ సూర్యనారాయణ, సెక్షన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకులకు ఫుల్లు కిక్కు..

పేదలకు ఝలక్



- మద్యం తాగించడంలో కూటమి ప్రభుత్వం సక్సెస్
- అందుబాటులో లీజు షాపులు, బెల్ట్ దుకాణాలు
- భారీగా పెరిగిన మద్యం విక్రయాలు
- పేదల ఆదాయాన్ని మద్యం రూపంలో లాగేస్తున్న ప్రభుత్వం

కార్తీకంలోనూ భారీగా విక్రయాలు

- ఎన్నడూ లేనివిధంగా కార్తీకమాసంలో ఈసారి గతం కంటే మించి అమ్మకాలు జరిగాయి.
- గత ఏడాది అక్టోబర్ కంటే ఈ ఏడాది అక్టోబర్‌లో ఐఎంఎల్(ఇండియన్ మేడ్ లిక్కర్) **42.07**శాతం అదనంగా విక్రయాలు జరగ్గా, బీర్లు **31.85**శాతం మేర అదనంగా విక్రయాలు పెరిగాయి.
- గత నవంబర్ కంటే ఈ నవంబర్‌లో ఐఎంఎల్ విక్రయాలు **10.92** శాతం మేర పెరగగా, బీర్లు విక్రయాలు **16.38**శాతం మేర పెరిగాయి.
- దీన్నిబట్టి జిల్లాలో మద్యం అమ్మకాల తీవ్రత ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడొక విశేషముంది. నవంబర్‌లో రెండు సార్లు మద్యం వ్యాపారుల నుంచి ప్రభుత్వం సొమ్ము వసూలు చేయడం, లాభాలు కూడా ముందు చెప్పినట్టు ప్రభుత్వం ఇవ్వకపోవడంతో లీజుదారులు డిమాండ్ మేర మద్యం విడిపించుకోవడం లేదు. వారికున్న పంచాయతీ తేలితే అమ్మకాల లెక్క మరింతగా ఉంటుందని వ్యాపారులు, అధికారులు చెబుతున్నారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తీసుకొచ్చిన మద్యం విధానం ప్రజలకు కీడు చేస్తుండగా, పాలకులకు మేలు చేస్తోంది. ఎన్నికల హామీలు ఎప్పుడు అమలు చేస్తారో తెలియదు గాని.. జనం వద్ద ఉన్న డబ్బులను లాగేసేందుకు మాత్రం నిత్యం మద్యం సరఫరా చేస్తామంటోంది. గత నెలన్నర రోజుల్లో జరిగిన మద్యం అమ్మకాలు చూస్తే.. భవిష్యత్‌లో మందుబాబుల కుటుంబాల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించలేని పరిస్థితి నెలకొంది.

విచ్చలవిడిగా సరఫరా..

సామాన్యుడిని ఆర్థికంగా ఛిన్నాభిన్నం చేసి, సామాజికంగానూ అనేక రకాల సమస్యల తెచ్చిపెట్టే మద్యం జనానికి దూరంగా ఉంచాలి. ఏ ప్రభుత్వమైనా ఇదే రకంగా ఆలోచించాలి. గత వైఎస్ జగన్ ప్రభుత్వం అదే చేసింది. షాపులను తగ్గించి, నిర్ణీత వేళల్లోనే విక్రయాలు చేపట్టింది. కానీ చంద్రబాబు ప్రభుత్వం అందుకు భిన్నంగా జనావాసాల్లో షాపులు పెట్టించింది. సమయపాలన మార్చేసింది. గతంలో ఉదయం 11 నుంచి రాత్రి 9గంటల వరకే మద్యం దుకాణాలు తెరిచి ఉంటే.. ఇప్పుడు



ఉదయం 9 నుంచి రాత్రి 10 గంటల వరకు విక్రయాలు సాగడంతో అమ్మకాలు భారీగా జరుగుతున్నాయి. దానికి తోడు బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా ఏర్పాటయ్యేలా సిండికేట్ వ్యవస్థ చురుగ్గా పనిచేస్తోంది. దాదాపు షాపులు ఎల్లో నేతల చేతుల్లో ఉండటంతో ఇష్టారీతిన లిక్కర్ బిజినెస్ చేస్తోంది. సురక్షిత తాగునీరు దొరకని గ్రామం ఏదైనా ఉండొచ్చు.. కానీ మద్యం దొరకని గ్రామాలు ప్రస్తుతం లేవు. దీంతో విక్రయాలు భారీగా జరుగుతున్నాయి.

పేదలపై ప్రభావం..

ప్రజలు తమకు అధికారమిస్తే మద్యం సరఫరా చేస్తామని చెప్పి హామీ ఇచ్చిన పార్టీగా దేశం మొత్తమ్మీద ఏదైనా పార్టీ ఉందంటే అది టీడీపీయే కావచ్చు. అనుకున్నట్టే అధికారం వచ్చింది. చెప్పినట్టే మద్యం ఏరులై ప్రవహింపచేస్తోంది. ఎక్కడికక్కడ మద్యం దొరికేలా షాపులను బార్లా తెరిచింది. వాటికి అనుబంధంగా బెల్ట్‌షాపులు కూడా మద్యాన్ని విస్తృతంగా సరఫరా చేస్తున్నాయి. గత ప్రభుత్వం, చంద్రబాబు సర్కార్‌లో పరిస్థితులను చూస్తే రోజు వారీ కూలిపై ఆధారపడి జీవించే వారి సంపాదనలో పెద్దగా మార్పు లేదు. దీనికితోడు కూటమి ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో నిర్మాణ రంగం కుదేలైంది. తాపీ పనివారు, రవాణా కూలీలు, సెంట్రింగ్ కార్మికులు .. ఇలా చాలా మంది ఉపాధిపై ప్రభావం పడింది. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న జనాల నుంచి మద్యం రూపంలో ప్రభుత్వం డబ్బులను లాగేస్తోంది.

విక్రయాలు ఇలా (కేసుల్లో)

సర్కిల్ పేరు	2023 అక్టోబర్ 16నుంచి 31వరకు ఐఎంఎల్	2023 అక్టోబర్ 16నుంచి 31వరకు బీర్లు	2024 అక్టోబర్ 16 నుంచి 31వరకు ఐఎంఎల్	2024 అక్టోబర్ 16 నుంచి 31వరకు బీర్లు
ఆమదాలవలస	4,943	1197	7,912	2,136
ఇచ్ఛాపురం	2,341	459	4,763	1,369
కోటబొమ్మాళి	6,521	1,687	8,545	1,845
కొత్తూరు	2,116	625	3,693	833
నరసన్నపేట	5,513	1,504	8,195	1,917
పలాస	6,073	1,929	9,577	3,049
పాతపట్నం	3,093	531	4,657	1,034
పొందూరు	4,673	1,450	6,272	1,574
రణస్థలం	8,079	3,205	9,602	3,152
సోంపేట	4,461	1,671	7,255	2,278
శ్రీకాకుళం	17,306	6,767	21,563	8,010
టెక్కలి	4,169	1,131	6400	2,016
	69,288	22,156	98,434	29,213



సర్కిల్ పేరు	2023 నవంబర్ 1 నుంచి 30వరకు ఐఎంఎల్	2023 నవంబర్ 1 నుంచి 30వరకు బీర్లు	2024 నవంబర్ 1నుంచి 30వరకు ఐఎంఎల్	2024 నవంబర్ 1నుంచి 30వరకు బీర్లు
ఆమదాలవలస	8,489	1,534	10,246	1,979
ఇచ్ఛాపురం	3,922	584	5,787	1,001
కోటబొమ్మాళి	10,243	1,771	11,245	1,692
కొత్తూరు	3,626	812	4,031	1,062
నరసన్నపేట	8,806	1,717	9,483	2,092
పలాస	10,301	2,562	11,178	3,444
పాతపట్నం	5,239	611	5,925	845
పొందూరు	7,556	1,753	7,520	1,877
రణస్థలం	12,675	3,890	13,201	3,913
సోంపేట	7,308	2,104	9,125	2,832
శ్రీకాకుళం	27,964	8,681	29,793	9,700
టెక్కలి	7,117	1,506	8,077	1,596
	1,13,246	27,525	1,25,611	32,033

తోలాపి ఘటనపై కలెక్టర్ ఆగ్రహం

పొందూరు: తోలాపి గ్రామ సచివాలయంలో కంప్యూటర్‌ను ధ్వంసం చేయడమే కాకుండా వీఆర్‌వో ఎం.దివాకర్(రేవతిరావు)పై భౌతికదాడికి పాల్పడిన ఘటనపై రెవెన్యూ ఉద్యోగులు బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు.

విధి నిర్వహణలో దాడులు చేస్తుంటే విధులు నిర్వహించలేమని తహశీల్దార్ వెంకటేష్ రామానుజం వద్ద స్పష్టం చేశారు.

పోలీసులకు ఫిర్యాదు..

తోలాపి సచివాలయ ఘటనకు సంబంధించి ఎంపీడీఓ మన్మధరావుపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఫోన్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరిగినా పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదని మండిపడ్డారు. తక్షణమే సంబంధిత వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు ఎంపీడీవో మన్మధరావు, తోలాపి సచివాలయం కార్యదర్శి కూన వినోద్‌లు బుధవారం పొందూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్‌ఓల నిరసన

దాడి చేసిన వారికి శిక్షించాలి..

కాశీబుగ్గ: తోలాపి వీఆర్‌ఓ పై జరిగిన దాడిని ఖండిస్తున్నామని జిల్లా వీఆర్‌ఓల సంఘం జిల్లా నాయకులు కొర్ల శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.


ధాన్యం కొనుగోలులో అక్రమాలు సహించం



రైస్‌మిల్లును పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్స్ ఎండీ మనజీర్ జిలానీ సమూన్

ఆమదాలవలస/బూర్జ: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే ప్రక్రియలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని సివిల్ సప్లయ్స్ ఎండీ మనజీర్ జిలానీ సమూన్ హెచ్చరించారు. బుధవారం ఆమదాలవలస మండలం జొన్నవలసలో ధాన్యం కొనుగోలు కేంద్రం, పట్టణంలోని శ్రీహరిపురం వద్ద పొట్నూరు సుందరరావుకు చెందిన రైస్ మిల్‌ను సందర్శించారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లర్లకు వెళ్లే ట్రక్ షీట్ మార్పులకు సంబంధించి పౌరసరఫరాల ఏఎస్ టెక్నికల్ శ్రీనివాసరావు నిర్వహణ తీరు, మిల్లర్లకు ఇప్పటి వరకు గన్నీలు అందించకపోవడంపై ఎండీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కస్టోడియన్లకు శిక్షణ అందించకపోవడంపై మండిపడ్డారు. ధాన్యం సేకరించిన వెంటనే మిల్లింగ్ చేసి బియ్యాన్ని ఎఫ్‌సీఐకు పంపించాలని మిల్లర్ రమేష్‌కుమార్‌కు సూచించారు. జాప్యం జరిగితే మిల్లు సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం బూర్జ మండలం డొంకలపర్త, పెద్దపేట గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలు, రైస్ మిల్లులను సందర్శించారు. ధాన్యం తేమ పేరుతో తూకంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని రైస్ మిల్లు యజమానిని హెచ్చరించారు. కొలుగోలు కేంద్రంలో సిబ్బంది లేకపోవడంపై మండిపడ్డారు. రైతులను మభ్యపెట్టి అక్రమంగా ధాన్యం కొనుగోలు చేసే దళారులపై చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా సివిల్ సప్లయ్స్ డీఎం టి.వేణుగోపాల్, తహశీల్దార్ రాంబాబు, ఏవో మోహన్‌రావు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

గుండెకు అండ



ఇటీవల ఆమదాలవలసకు చెందిన ఓ మహిళ అనారోగ్యం కారణంగా సామాజిక ఆస్పత్రిలో చేరారు. అక్కడ అకస్మాత్తుగా పడిపోయారు. అక్కడే ఉన్న 108 ఈఎంటీ సీపీఆర్ చేయడంతో ఆమె సాధారణ స్థితికి చేరారు.

కోటబొమ్మాళి విద్యుత్‌నగర్ కాలనీకు చెందిన ఓ యువకుడికి హఠాత్తుగా హార్ట్ ఎటాక్ రావడంతో కుప్పకూలిపోయాడు. సమీపంలో ఉన్న ఫిజియోథెరపిస్టు ఎల్.సంధ్యారాణి అక్కడకు చేరుకు సీపీఆర్ చేసి సాధారణ స్థితికి వచ్చారు.

సీపీఆర్ ఓ మహత్తర ప్రక్రియ. లిప్తపాటులో ఆగిన గుండెను తిరిగి సాధారణ స్థితికి చేర్చగలిగే సాధనం. వైద్యరంగంలోని వారే కాదు ఎవరైనా దీన్ని ప్రయోగించగలగడం దీని విశేషం. ప్రజలు సీపీఆర్‌పై అవగాహన పెంచుకుంటే ఆస్పత్రికి తీసుకెళ్లేవరకైనా అభాగ్యుల ప్రాణాలు నిలబడతాయని వైద్యులు తరచూ చెబుతుంటారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, చదువుకున్న వారు కచ్చితంగా సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలని సూచిస్తున్నారు.

- టెక్కలి

- అత్యవసర సమయాల్లో ప్రాణాలు నిలబెడుతున్న సీపీఆర్ విధానం
- సీపీఆర్‌పై విస్తృత ప్రచారం అవసరం



సీపీఆర్ చేసే విధానంపై 108 సిబ్బందికి అవగాహన కలిస్తున్న జిల్లా టెక్నికల్ సిబ్బంది(ఫైల్)

సిబ్బందికి అవగాహన



ప్రమాదాలు అత్యవసర సమయాల్లో తక్షణమే 108 వాహనాలు వెళ్తుంటాయి. ఇదే సమయంలో ఆయా ప్రమాదాల్లో చిక్కుకుని అపస్మారక స్థితికి చేరుకునే వారిని రక్షించేందుకు సీపీఆర్ ఎంతో ఉపయోగపడుతుంది. దీనిపై జిల్లా వ్యాప్తంగా ఉన్న సిబ్బందికి ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నాం. ఈ సీపీఆర్ పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి.

– ఎస్.కృష్ణారావు, 108 జిల్లా ఓజేటీ

ప్రాణాలు కాపాడవచ్చు



సీపీఆర్ విధానంలో అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడవచ్చు. ఈ విధానం పై కొన్ని సంస్థలు శిక్షణలు ఇస్తున్నాయి. ఇది కేవలం వైద్యులు మాత్రమే కాదు సాధారణ వ్యక్తులు సైతం అవగాహన చేసుకోవచ్చు. ఇదే సీపీఆర్ విధానంతో ఇటీవల ఓ వ్యక్తికి ప్రాణాలు కాపాడాను.

– డాక్టర్ ఎల్.సంధ్యారాణి, ఫిజియోథెరపిస్టు, కోటబొమ్మాళి.


సీపీఆర్ అంటే..

కార్డియో పల్మోనరి రిససిటేషన్ అనేది ఎవరికైనా శ్వాస తీసుకోవడం లేదా గుండె కొట్టుకోవడం ఆగిపోయినప్పుడు అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే ప్రాణాలను రక్షించే టెక్నిక్. మునిగిపోవడం, గుండెపోటు లేదా ఆకస్మిక కార్డియాక్ అరెస్ట్ వంటి సందర్భాల్లో ఇది చేయవచ్చు.

ఎందుకంత కీలకమైనది?

గుండె ఆగిపోయినప్పుడు, ఆక్సిజన్‌తో కూడిన రక్తం లేకపోవడం వల్ల కేవలం కొన్ని నిమిషాల్లో మెదడు దెబ్బతింటుంది. ఇదే సమయంలో సీపీఆర్ అనేది మెదడు ఇతర ముఖ్యమైన అవయవాలకు ఆక్సిజన్‌తో కూడిన రక్తాన్ని ప్రవహించడంలో సహాయపడుతుంది. అత్యవసర సేవలు చేపట్టే వరకు ప్రాణాలు నిలిచే అవకాశాలను గణనీయంగా పెంచుతుంది.

ఎలా చేయాలి..?



- సీపీఆర్ చేసే ముందు క్షతగాత్రుడు సురక్షితంగా ఉన్నది లేనిది నిర్ధారించుకోవాలి. ట్రాఫిక్, అగ్ని లేదా విద్యుత్ ప్రమాదాలు వంటి ఏవైనా తక్షణ ప్రమాదాల నుంచి దూరంగా తీసుకురావాలి.
- చిన్నారులకు, శిశువులకు చేసే ప్రక్రియ కొంచెం విభిన్నంగా ఉంటుంది. ఛాతీ అదిమిపట్టే విధానం, నోటిలోకి గాలి ఊదే ప్రక్రియ అన్నింటిలోనూ కొంచెం కచ్చితత్వం అవసరం. దీనికోసం ప్రత్యేకంగా, సునిశితంగా అవగాహన పెంచుకోవాల్సి ఉంటుంది.
- **క్షతగాత్రుడి ప్రతిస్పందన కోసం ప్రయత్నించాలి.**
- బాధితుడి శరీర వెనుక భాగంలో దృఢమైన ఉపరితలంపై ఉంచాలి.
- ఒక చేత్తో గడ్డం పైకెత్తి, మరో చేత్తో నుదిటిపైకి నెట్టడం ద్వారా తలను మెల్లగా వెనుకకు వంచాలి. ఇది వాయుమార్గాన్ని తెరవడానికి సహాయపడుతుంది. ఏదైనా శ్వాస శబ్దాలను జాగ్రత్తగా వినాలి. ఛాతీ కదలికల కోసం చూడాలి. దీనికి 10 సెకన్ల కంటే ఎక్కువ సమయం పట్టదు.
- వ్యక్తి శ్వాస తీసుకోకపోతే లేదా ఊపిరి పీల్చకుంటే, వెంటనే సీపీఆర్ ప్రారంభించాలి. ఛాతిపై చేతులతో కుదించడం అనేది సీపీఆర్‌లో కీలకమైన దశ.
- ఒక చేతి మడమను ఛాతీ మధ్యలో, రొమ్ము ఎముక (స్టెర్నమ్) దిగువ భాగంలో ఉంచాలి. మీ వేళ్లను ఇంటర్‌లాక్ చేస్తూ మీ మరో చేతిని పైన ఉంచాలి. మీ మోచేతులు నిటారుగా, భుజాలను నేరుగా మీ చేతులపై ఉంచండి. నిమిషానికి 100 నుంచి 120 కుదింపుల చొప్పున కనీసం 2 అంగుళాల లోతులో ఛాతీని గట్టిగా వేగంగా నొక్కాలి. కుదింపుల మధ్య ఛాతీ పూర్తిగా పైకి వచ్చే విధంగా చూసుకోవాలి.



ఇటీవల టెక్కలిలో సీపీఆర్ విధానం పై 108 సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న జిల్లా టెక్నికల్ సిబ్బంది

స్వర్ణ పతక విజేతకు సత్కారం



హేమశ్రీని అభినందిస్తున్న వీసీ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నవంబర్ 26 నుంచి 28 వరకు జరిగిన సౌత్ వెస్ట్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం తరఫున పాల్గొన్న విద్యాధరి డిగ్రీ కళాశాల విద్యార్థిని డి.హేమశ్రీ బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినిని బుధవారం వర్సిటీలో సన్మానించారు. కార్యక్రమంలో వీసీ రజిని, అధికారులు పాల్గొన్నారు. త్వరలో హిమాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో హేమశ్రీతో పాటు శారద డిగ్రీ కళాశాల విద్యార్థిని వర్షిత, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఝాన్సీరాణి కూడా హాజరుకానున్నారు.

‘నృత్య’ వైభవం



శ్రీకాకుళం నగరానికి చెందిన లయశ్రీ నృత్య కళా నికేతన్ విద్యార్థులు తిరుమల తిరుపతి దేవస్థానం పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. కె.పరిమళ హరిహర్ తమ శిష్యబృందంతో సర్వభూపాల, గజ వాహన సేవలో నృత్య నీరాజనం సమర్పించి ప్రశంసలు అందుకున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

క్లుప్తంగా

అనారోగ్యంతో విద్యార్థిని మృతి


కొండాల నిఖిత(ఫైల్)

నందిగాం: మండలంలోని తురకులకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కొండాల నిఖిత అనారోగ్యంతో మృతి చెందిందని పాఠశాల హెచ్ఎం డి.శ్రీలక్ష్మీ తెలిపారు. గ్రామానికి చెందిన కొండాల నాగేశ్వరరావు కుమార్తె అయిన నిఖిత గత పది రోజులుగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. అయితే మంగళవారం రాత్రి పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతి చెందింది. మండలవిద్యాశాఖాధికారి జి.నర్సింహులు విద్యార్థిని కుటుంబ సభ్యులను కలిసి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థిని మృతిపై ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు సంతాపం తెలిపారు.

ఇంటి ఆవరణలో గంజాయి మొక్క


గంజాయి మొక్కను పరిశీలిస్తున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది

హిరమండలం : మండలంలోని భగీరథపురం కాలనీ బ్రాహ్మణవీధి రెండో లైన్‌లో కొల్లి ముఖలింగం ఇంటి ఆవరణలో పెంచుతున్న గంజాయి మొక్కను బుధవారం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ మహమ్మద్ యాసీన్ తెలిపారు. తహసీల్దార్ హనుమంతరావు సమక్షంలో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ముఖలింగంను అదుపులోకి తీసుకున్నామని, రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు. తనిఖీల్లో డీటీ నీలిమ, వీఆర్వో సింహాద్రి పాల్గొన్నారు.

ముగిసిన 'పరఖ్' సర్వే


శ్రీకాకుళంలోని ఓ స్కూల్లో సర్వేలో పాల్గొన్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో బుధవారం నిర్వహించిన పరఖ్ సర్వేక్షణ్–2024 సర్వే ప్రశాంతంగా ముగిసింది. పెర్ఫార్మెన్స్ అసెస్‌మెంట్ రివ్యూ అండ్ అనాలసిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హాలిస్టిక్ డెవలప్‌మెంట్ (పరఖ్) పేరిట జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 92 (ప్రభుత్వ 56, ప్రైవేటు36) పాఠశాలల్లో 3, 6, 9 తరగతులకు చెందిన 2388 మంది విద్యార్థులు సర్వేలో భాగస్వాములయ్యారు. డీఈఓ ఎస్.తిరుమల చైతన్య, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్, డీసీఈబీ సెక్రటరీ జి.రాజేంద్రప్రసాద్, జిల్లా ట్రైనర్లు తీడ ప్రసాదరావు (సీఆర్ఎంటీ సారవకోట), పట్ట వైకుంఠరావు (సీఆర్ఎంటీ జలుమూరు) పలు కేంద్రాలను పరిశీలించారు.

9న జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: గార మండలంలోని వమ్మరవల్లి డైట్ శిక్షణా కేంద్రంలో ఈ నెల 9న జిల్లాస్థాయి కళా ఉత్సవ్–2024 పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య సంస్థలకు చెందిన అన్ని రకాల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఓకల్ మ్యూజిక్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, డాన్స్, థియేటర్ (నాటకం), విజువల్ ఆర్ట్స్, ట్రెడిషినల్ స్టోరీ టెల్లింగ్ అంశాల్లో పోటీలుంటాయని వివరించారు. గత ఏడాది కళా ఉత్సవాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు ఈ ఏడాది పాల్గొనడానికి అనర్హులని స్పష్టం చేశారు. పోటీల్లో పాల్గొనేందుకు కావాల్సిన మెటీరియల్స్‌ను ఎవరికి వారే సమకూర్చుకోవాలని సూచించారు. ఈ నెల 6వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగాపేర్లను నమోదు చేసుకోవాలని, వివరాలకు జి.వెంకటరమణ (94918 13995), వైపీఏ నాయుడు (99891 29255)లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి


భోజనం పరిశీలిస్తున్న గురుకులాల జిల్లా సమన్వయాధికారి బాలాజీ

పాతపట్నం: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా సమన్వయాధికారి ఎస్.బాలాజీ అన్నారు. పాతపట్నం బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నిర్దిష్ట లక్ష్యాన్ని పెట్టుకుని చదువుకోవాలన్నారు. శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. అనంతరం పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.అర్చన, దుప్పలవలస, తామరాపల్లి ప్రిన్సిపాల్స్ బి.బుచ్చిరాజు, ఆర్.వి.కృష్ణతార, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రారండోయ్.. వేడుక చూద్దాం..!

- మత సామరస్యానికి ప్రతీక పీర్లకొండ యాత్ర
- విభిన్న సంస్కృతుల కలయికకు నిలయం
- ఏటా మార్గశిర గురువారాల్లో ప్రత్యేక యాత్రలు

ఇచ్ఛాపురం:

ఇచ్ఛాపురం పట్టణానికి పశ్చిమాన ఉన్న పీర్లకొండ యాత్రకు వేళయ్యింది. ఏటా మార్గశిర మాస గురువారాల్లో నిర్వహించే ఈ యాత్ర మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఈ యాత్రలో మతాలకు అతీతంగా ప్రజలు కొండపైనున్న పవిత్ర స్థలం వద్ద పూజలు చేయడం ప్రత్యేకత సంతరించుకుంది. ముఖ్యంగా ముస్లిం ప్రార్థనా మందిరాల్లో ముస్లింలతో పాటు హిందువులు కలిసి వారి సాంప్రదాయ పద్ధతుల్లో పూజలు, ప్రార్థనలు చేయడం విశేషం.

ఇదీ విషయం

క్రీస్తుశకం 16వ శతాబ్ధంలో ముస్లిం దేశం నుంచి మత గురువు షేక్ ఫరీద్ షక్కర్ గంజా బాబా ప్రజలను సన్మార్గంలో నడిపించేందుకు మత బోధనలు చేస్తూ, ధార్మిక ఉపదేశాలిస్తూ అఫ్ఘనిస్తాన్ నుంచి కాంధాహార్ గుండా ఉత్తర భారతదేశంలోకి ప్రవేశించారు. ఢిల్లీ, అజ్మీర్, విజయవాడ, కొండపల్లి ప్రాంతాల్లో 40 రోజులపాటు ఉపవాస దీక్షలు చేస్తూ ధార్మిక ఉపదేశాలు ఇచ్చేవారు. ఈవిధంగా ధార్మిక ఉపదేశాలు చేస్తూ ఉత్తరాంధ్ర ప్రాంతంలోకి ప్రవేశించారు. విశాఖపట్నం నుంచి ఉపవాస దీక్ష చేస్తూనే ఇచ్ఛాపురం పట్టణానికి చేరుకున్నారు. అయన పట్టణానికి పడమర వైపున ఉన్న కొండపైకి వెళ్లి ఉపవాస దీక్షను పూర్తి చేసినట్లు పూర్వీకులు తెలిపిన కథనాలు ఉన్నాయి. అనంతరం ఆయన ఇక్కడి నుంచి ఉత్తరాది రాష్ట్రాల గుండా పాకిస్తాన్‌లోని పంజాబ్ రాష్ట్రం పాక్ పఠాన్‌కు వెళ్లి కాలం చేసి, అల్లాలో లీనమైనట్లు, అక్కడే ఆయన సమాధి ఉన్నట్లు స్థానికంగా ప్రచారంలో ఉంది. ముస్లిం పెద్దలు తెలిపిన వివరాల మేరకు బాబాకి చక్కెర అంటే ఇష్టం కావడంతో ఆయన షక్కర్‌గంజ్ బాబాగా ప్రసిద్ధి చెందారు. ఈయన పట్టణంలోని పీర్లకొండపై ధ్యానం చేసే సమయంలో మిస్వాక్ అనే చెట్టుపుల్లతో దంతాలను శుభ్రపరుచుకునేవారని, ఆ పుల్లను కొండపై పాతిపెట్టడంతో అది కాస్త చెట్టుగా తయారైందని అంటారు. ఈ చెట్టు ఫలాలను తినడం వల్ల సంతానం కలిగేదని చెబుతుంటారు. ఇదిలా ఉండగా ఈ చెట్టు ప్రత్యేకత తెలియక వంట చెరకు కోసం కొట్టుకుపోవడం, కాలక్రమేణా వాతావరణంలో కలిగే మార్పుల వల్ల చెట్టు కనుమరుగైపోయింది. బాబా ధ్యానం చేసే సమయంలో తాగేందుకు కొండపైన ఆయన ధ్యాన సమయంలో ఉపయోగించే కర్రతో కందకం చేయగా, చేతికి అందే ఎత్తులో నీరు చేరడంతో దాహాన్ని తీర్చుకునేందుకు ఆ నీటినే తాగేవారు. ప్రస్తుతం ఆ కందకంలో నీరు అన్నివేళల్లో నిండుకుండలా ఉంటుంది. ఆ కందకంలోని లభించే పవిత్ర జలాన్ని చెవిలో వేసుకుంటే చెవి సంబంధిత రోగాలు, కంటిలో వేసుకుంటే నేత్ర సమస్యలు నయమవుతున్నాయని యాత్రికుల నమ్మకం.


పీర్లకొండపై ముగావర్‌ని దర్శించుకుంటున్న యాత్రికులు (ఫైల్)

ముడుపులు చెల్లించడం

వరిపంట చేతికి సక్రమంగా రావాలని ఇక్కడ రైతులు ముడుపులు కట్టి కోతలు కోయడం ప్రారంభిస్తారు. ఉద్యోగాలు రావాలని యువత, సంతానం కలగాలని బాబాకి స్త్రీ, పురుషులు పటిక, బెల్లం, బియ్యం, డబ్బులు ముడుపులు గా కట్టి యాత్రలో ముడుపులు చెల్లిస్తుంటారు.

యాత్ర చరిత్ర


పీర్లకొండ మొదటి మెట్టు వద్ద హిందూ సంప్రదాయంలో పూజలు చేస్తున్న యాత్రికులు(ఫైల్)

1968లో వచ్చిన తుఫాన్ ప్రభావంతో ఇచ్ఛాపురానికి సమీపంలోని చిలక సరస్సు ఉప్పొంగింది. దీంతో చుట్టుపక్కల ప్రాంతాలన్నీ వరద ముంపునకు గురయ్యాయి. ఈ సమయంలో ఏం చేయాలో తోచక అన్ని మతాలకు చెందిన ప్రజలంతా ఈ కొండపైకి చేరారు. ఈ ప్రకృతి విలయం నుంచి తమను కాపాడాలని కొండపైనే అంతా కలిసి భగవంతుణ్ణి ప్రార్థించారు. ఈ సమయంలో ఆకాశం నుంచి నగారా మోగినట్లు పెద్దశబ్ధం రావడంతో తుఫాన్ చల్లబడి వరద ముంపు తగ్గిందని స్థానికులు చెబుతుంటారు. అప్పటి నుంచి ప్రతిఏటా మార్గశిర గురువారాల్లో అన్నిమతాల వారు కొండపైకి వెళ్లి పూజలు చేయడం ప్రారంభించారు. ఈ మార్గశిర గురువారం పూజలు జరిగే రోజుల్లో హిందూ మహిళలు వారి ఇళ్లలో ఉపవాస దీక్షచేసి భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవికి పూజలు చేయడం ప్రత్యేకత. కాలక్రమేణా ఈ కొండను పీర్లకొండగాను, ఇక్కడ ప్రతీఏటా జరుగుతున్న యాత్ర పీర్లకొండ యాత్రగా ప్రసిద్ధి చెందింది. నవాబుల పరిపాలనలో ఈ కొండపైన బాబా ధ్యానం చేసిన ప్రదేశం వద్ద ఒక ముగావర్ అనే దర్గాను నిర్మించడంతో పాటు కొంతదూరంలో ముస్లింల ప్రార్థనా మందిరాన్ని నిర్మించారు. వీటి బాగోగులు చూసుకునేందుకు ఫరీద్ అనే వంశీయులకు చెందిన వ్యక్తిని ముజావర్‌లు(సేవకులు)గా నియమించారు. అప్పటి నుంచి ఈ మందిరాలను దర్శించుకుంటున్న యాత్రికులు పవిత్ర స్థలాలుగా భావించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతం ఆంధ్ర – ఒడిశా సరిహద్దు కావడంతో ఒడియా, తెలుగు సంస్కృతుల కలయిక వల్ల రెండు వారాలు నిర్వహించుకోవాల్సిన యాత్ర కాస్త నాలుగు వారాలు జరుపుకుంటారు. వీటిలో ముఖ్యంగా ఒడియా, తెలుగు సాంప్రదాయం మేళవింపులో భాగంగా ఒడియా వారి మూడో గురువారం, తెలుగువారికి మొదటి గురువారం అవుతుంది. ఈ యాత్రకు వెస్ట్ బెంగాల్, ఒడిశా, విశాఖపట్నం, రాజమండ్రి వంటి ప్రాంతాల నుంచి సుమారుగా 50వేలకు పైబడి యాత్రికులు వస్తుంటారు.

నిర్లక్ష్య ధోరణితో ప్రతిష్టకు భంగం

- విచారణ చేపట్టిన ఏసీ ప్రసాద్ పట్నాయక్


విచారణ చేపడుతున్న దేవదాయ శాఖ అధికారులు

టెక్కలి: ఎంతో పవిత్రమైన రావివలస ఎండల మల్లన్న దేవాలయ ప్రతిష్టకు భంగం కలిగేవిధంగా దేవదాయ శాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, కార్తీక మాసోత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలిగేలా తప్పిదాలు చేశారని బీజేపీ కార్యకర్తలు ఎస్.లక్ష్మీనారాయణ, సీహెచ్ లింగరాజు, జె.పరమేశ్వరరావు, జనసేన కార్యకర్త జనార్థన్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల మల్లన్న సన్నిధిలో జరిగిన కార్తీక మాసం సోమవారం ఉత్సవాల్లో భాగంగా టికెట్లు, ఉచిత ప్రసాదాల పంపిణీలో చోటు చేసుకున్న తప్పిదాలపై పలు పత్రికల్లో కథనాలు, భక్తుల ఫిర్యాదుల మేరకు దేవదాయ శాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్‌తో పాటు ఇతర అధికారులు ఆలయంలో బుధవారం విచారణ చేపట్టారు. ప్రతిఏటా ఎంతో వైభవంగా జరిగే కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఈ ఏడాది భక్తులకు కనీసం ప్రసాదాలు సైతం అందివ్వలేని విధంగా ఉత్సవాలను నిర్వహించారని ఫిర్యాదుదారులు మండిపడ్డారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ప్రసాదాలు లేకపోవడంతో ఎంతో అసహనంగా వెనుదిరిగారని గుర్తుచేశారు. విచారణలో అధికారులు అన్ని వర్గాల నుంచి వివరాలను సేకరించారు. కార్యక్రమంలో అధికారులు వెంకటరమణ, ప్రభాకరరావు, కోదండ, పంచాయతీ కార్యదర్శి పి.రవికుమార్, వీఆర్వో ఆర్.అప్పన్న, అర్చకులు రామకృష్ణ, మోహన్‌రావు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాపర్టీ కేసులు ఛేదించాలి


మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: సమగ్ర దర్యాప్తుతో ప్రాపర్టీ కేసులు త్వరితగతిన ఛేదించి రికవరీ చేయాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అధికారులకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వర్చువల్‌గా జిల్లావ్యాప్తంగా ఉన్న డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 14న జరిగే లోక్ అదాలత్‌లో రాజీ పడేందుకు అవకాశమున్న కేసులు చూడాలన్నారు. మహిళలపై వేధింపులు, దాడులు, పోక్సో, ఎస్సీ, ఎస్టీ, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో దర్యాప్తు, ముద్దాయిల అరెస్టుల గురించి ఆరా తీశారు. వీటిల్లో పెండింగ్ ఉన్నవాటి కారణాలను తెలుసుకున్నారు. పోక్సో కేసుల్లో 60 రోజుల్లోగా అభియోగపత్రాలు దాఖలు చేయాలని, ఎన్‌ఫోర్సుమెంట్ కేసులు పెంచాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ఎస్పీతో జూమ్ కాన్ఫరెన్సులో అదనపు ఎస్పీ కె.వి.రమణ, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

14 రోజుల జైలు శిక్ష

బహిరంగంగా మద్యం సేవించి న్యూసెన్స్ సృష్టించిన రౌడీ షీటర్‌కు శ్రీకాకుళం సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి 14 రోజుల జైలు శిక్ష విధించారని ఒకటో పట్టణ ఎస్ఐ ఎం.హరికృష్ణ పేర్కొన్నారు. బుధవారం కంద్రవీధికి చెందిన బొమ్మలాట హరికృష్ణ పూటుగా మద్యం తాగి వచ్చేపోయే ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగించాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ హరికృష్ణ అదుపులో తీసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఈ మేరకు జడ్జి శివరామకృష్ణ 14 రోజుల జైలు శిక్షవిధించారు.

రైలు ఢీకొని మేకలు మృతి

టెక్కలి రూరల్: మండలంలోని లింగాలవలస గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం రైలు ఢీకొని 7 మేకలు మృతి చెందాయి. ఈ మేరకు స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. లింగాలవలస గ్రామానికి చెందిన లండ అప్పారావు అనే వ్యక్తి తన మేకలను రైలు పట్టాలు పక్కగా తీసుకెళ్తుండగా, అదే సమయంలో గుణుపూర్ నుంచి రౌర్కెలా వైపు వెళ్తున్న రాజారాణి ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 7 మేకలు మృతి చెందినట్లు తెలిపారు. తన మేకలు మృతి చెందడంతో బాధితుడు లబోదిబోమంటున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


గొట్టిపల్లి శ్యామ్యూల్ మృతదేహం

మెళియాపుట్టి: మండలంలోని కొసమాల గ్రామానికి చెందిన వృద్ధుడు గొట్టిపల్లి శ్యామ్యూల్(60) బుధవారం సాయంత్రం ఆంధ్ర, ఒడిశా సరిహద్దు దవిడిగాం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొసమాల గ్రామానికి చెందిన సానాపురం గంగధర్, గొట్టిపల్లి శ్యామ్యూల్ ఇద్దరూ కలిసి బుధవారం సాయంత్రం పర్లాకిమిడి(ఒడిశా) వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఒక ప్రైవేటు బస్సును ఢీకొన్నారు. ఈ ఘటనలో అక్కడికక్కడే గొట్టిపల్లి శ్యామ్యూల్ మృతి చెందగా, గంగధర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గంగధర్‌ను పర్లాకిమిడి జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం ఆటోలో తరలించారు. ఒడిశా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జమ్మూ ఐఐటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పైడి


అనిల్‌కుమార్

ఆమదాలవలస: పట్టణంలోని రెండో వార్డు కృష్ణాపురానికి చెందిన పైడి అనిల్ కుమార్ జమ్మూలోని ఐఐటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికయ్యాడు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ అండ్ ఇంటర్ డిసిప్లినరీ ప్రోగ్రామ్స్ విభాగానికి ఈయన ఎంపికైనట్లు బుధవారం తెలిపారు. అనిల్ కుమార్ ప్రాథమిక విద్య సరుబుజ్జిలి మండలంలోని వెన్నెలవలస నవోదయ విద్యాలయంలో కొనసాగింది. ఐఐటీ మద్రాసులోని కెమిస్ట్రీ విభాగంలో పీహెచ్‌డీ చేశారు. సాలిడ్ స్టేట్ కెమిస్ట్రీలో పోస్ట్ డాక్టరల్ రీసెర్చ్ చేశాడు. అలాగే ఐఐటీ బాంబేలో లిథియం అయాన్ బ్యాటరీ డవలప్‌మెంట్‌లో పోస్ట్ డాక్టరల్ రీసెర్చ్ చేశాడు. సౌత్ కొరియాలో లిథియం, సోడియం బ్యాటరీ డవలప్‌మెంట్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివారు. అనిల్ కుమార్ తల్లిదండ్రులు పైడి నారాయణమూర్తి, వెంకట సత్యవతి సాధారణ కుటుంబీకులు. తండ్రి నారాయణమూర్తి పట్టణంలో అనిల్ సప్లయర్స్ నడుపుతూ కుటుంబ జీవనం కొనసాగిస్తున్నారు. అనిల్ కుమార్ భార్య ఉషారాణి గృహిణి. అనిల్ కుమార్ ఐఐటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కొలువు సాధించడంపై బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు అభినందనలు తెలుపుతున్నారు.

మందసలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి


సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న గిరిజన, ప్రజా సంఘాల నాయకులు

కాశీబుగ్గ: మందస కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని, గిరిజన ప్రాంతంలో గిరిజనేతరుల ఆధీనంలో ఉన్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని గిరిజన సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు కొండలోగాం సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సచివాలయ అధికారి డి.రవిశంకర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గిరిజన సంఘ జిల్లా కార్యదర్శి సవర ఫల్గుణరావు, నాయకులు సవర బాలకృష్ణ, జయరాజ్, నరసింహ, ప్రజా సంఘాల నాయకులు తెప్పల అజయ్‌కుమార్, నెయ్యిల గణపతి, కె.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రామికులకు ఆసరాగా 'ఈ–శ్రమ్'

- అసంఘటిత రంగ కార్మికులకు గుర్తింపు
- శ్రమజీవుల ఆర్థిక సామాజిక భద్రతకు దోహదం
- లేబర్ కార్యాలయం, సచివాలయాల్లో నమోదు


భవన నిర్మాణ కార్మికులు

సంతబొమ్మాళి: అసంఘటిత రంగ కార్మికులకు, ఎలాంటి చిరునామా లేకుండా వ్యాపార కార్యకలాపాలు చేసే చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులకు ఆర్థిక, సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ–శ్రమ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. క్షేత్ర స్థాయిలో కార్మికుల వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వ కార్మిక శాఖ పర్యవేక్షణలో చర్యలు చేపట్టింది. జిల్లాలో 4,93,481 మంది ఈ శ్రమ్‌లో వివరాలు నమోదు చేసుకున్నారు.

పథకం లక్ష్యం ఇదీ..

పెద్ద వ్యాపారులు, వ్యాపార సంస్థలు ప్రభుత్వం వద్ద నమోదు చేసుకొని తన కార్యకలాపాలు కొనసాగిస్తుంటాయి. వాటికి గుర్తింపు, రుణసాయం తదితర సదుపాయాలు సమకూరుతాయి. వలస, అసంఘటిత రంగ కార్మికులకు, చిరు వ్యాపారులకు అటువంటివి దక్కవు. అలాంటి వారికి సామాజిక, ఆర్థిక భద్రత కల్పించాలన్న లక్ష్యంతో కేంద్రం ఈ పథకాన్ని రూపొందించింది.

అర్హులు వీరే..

16 నుంచి 59 ఏళ్లలోపు భవన నిర్మాణ కార్మికులు, వలస కార్మికులు, ఇంటి పని వారు, వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు, మత్స్యకారులు, పశుపోషకులు, తోలు కార్మికులు, వడ్రంగి, ఉప్పు కార్మికులు, ఇటుక బట్టీ కార్మికులు, వీధి వ్యాపారులు, ఆటో, రిక్షా కార్మికులు, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు, షాపులలో పనిచేసే సిబ్బంది, ఈఎస్ఐ, పీఎఫ్ పొందే అర్హత లేనివారు ఈ పథకంలో లబ్ధి పొందేందుకు అర్హులు.

ఇవీ ప్రయోజనాలు..

- విపత్తుల కాలంలో శ్రామికులను ఆదుకునే దిశగా ఈ పథకాన్ని రూపొందించారు. ఇందులో ఒక్కసారిగా నమోదైతే సరిపోతుంది. రెన్యువల్ చేయించవసరం లేకుండా జీవితాంతం వివరాలు వెబ్‌సైట్లో ఉంటాయి.
- వృత్తి నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను పొందేందుకు ఈ కార్డు ఉపకరిస్తుంది. అసంఘటిత కార్మికులు సామాజిక భద్రత చట్టం కింద ప్రయోజనాలు పొందేందుకు ఈ నమోదు అవసరం. సంస్థల్లో పనిచేసే వారికి సంస్థ ద్వారా గుర్తింపుతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు లభిస్తాయి.
- అసంఘటితంగా ఉన్న కార్మికులకు ఎలాంటి గుర్తింపు, సదుపాయాలు లేవు. ఈ విషయమై ఇటీవల సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలిచ్చింది. దీంతో కేంద్రప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్రాల్లో అసంఘటితంగా ఉన్న కార్మికులందరినీ గుర్తించి గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ ముమ్మరంగా సాగుతుంది. కార్డు కలిగిన వారికి రూ.2 లక్షల ప్రమాద భీమా, పనిలో ఉండగా అంగవైకల్యం కలిగితే రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తారు.

నమోదు ఇలా..

కార్మికులు పోర్టల్లో నమోదు చేసుకునేందుకు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదు. ఉచితంగా వివరాలను నమోదు చేసి యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యూఎస్ఏ) గుర్తింపు కార్డును సైతం జారీ చేస్తారు. సమీపంలోని వార్డు, గ్రామ సచివాలయం, సీఎస్‌సీ సెంటర్, లేబర్ ఆఫీసర్ కార్యాలయంలో ఈ– శ్రమ్ వివరాలను నమోదు చేస్తారు. కార్మికుడు తన ఆధార్, బ్యాంక్ ఖాతాల జిరాక్స్ కాపీలతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటోను తీసుకెళ్లాలి. నామినీ ఆధార్, బ్యాంక్ ఖాతాల జిరాక్స్ కాపీలను కూడా ఇవ్వాలి. కార్మికుడు ఎవరి వద్ద పని చేస్తున్నాడో వెల్లడి చేయాల్సిన అవసరం లేదు. ఏ వృత్తి చేస్తున్నాడో చెబితే సరిపోతుంది. ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం లేని, ఇన్‌కంటాక్స్ పరిధిలో లేని కార్మికుల నమోదు చేసుకోవచ్చు. కోటి రూపాయలు లోపే టర్నోవర్ ఉన్న చిరు వ్యాపారులు వివరాలు నమోదు చేసుకోవచ్చు.

నిరంతర ప్రక్రియ

ఈ–శ్రమ్ నమోదుపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. అసంఘటిత కార్మికులు లేబర్ కార్యాలయంతో పాటు సీఎస్‌సీ, గ్రామ వార్డు సచివాలయాల్లో కూడా వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఇది నిరంతర ప్రక్రియ.

– రాధాకుమారి, లేబర్ ఇన్స్పెక్టర్, టెక్కలి

పొట్టకొట్టే ఎయిర్‌పోర్టులు వద్దు


ఒంకులూరులో ఆందోళన చేస్తున్న రైతులు

- ఉద్దాన రైతుల ఆందోళన

వజ్రపుకొత్తూరు రూరల్: ఏళ్ల తరబడి ఉద్దాన ప్రాంత భూముల్లో ఉద్యాన పంటలను నమ్ముకొని జీవనోపాధి సాగిస్తున్నామని, తమ పొట్టకొట్టే ఎయిర్ పోర్టులు ఈ ప్రాంతంలో వద్దని రైతులు పేర్కొన్నారు. ఈ మేరకు ఒంకులూరులో బుధవారం ఆదిబలిజ సేవా సంఘం అధ్వర్యంలో బాధిత గ్రామాల రైతులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎయిర్ పోర్టులు వద్దు. మా భూములు ముద్దు అంటూ నినాదాలు చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ అభివృద్ధి పేరిట పచ్చని ఉద్దాన ప్రాంతాన్ని నాశనం చేయడం సరికాదన్నారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే ఈ ప్రాంతాన్ని వినాశనం చేసే అభివృద్ధి వద్దని పేర్కొన్నారు. ప్రభుత్వాలు ప్రజల మేలు కోరి అభివృద్ధి చేయాలనుకుంటే ఈ ప్రాంతంలో ఉద్యాన పంటల అధారిత పరిశ్రమలు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వాలు ఏకపక్షంగా తీసుకున్న కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణ అలోచనను ఉపసంహరించుకోవాలని, లేదంటే ఈ ఎయిర్ పోర్టు వేరే ప్రాంతానికి తరలించాలని కోరారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో పాలకులు ముందుకు వెళ్తే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఒంకులూరు, మోటూరు, బర్రివానిపేట, చీపురపల్లి, సంతోష్‌నగర్ తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నేలవాలిన ఆశలు..!


కాశీబుగ్గ: సున్నాడలో వాలిన పంటను కోస్తున్న కూలీలు


టెక్కలి: రావివలసలో ధాన్యం ఆరబెడుతున్న రైతు

కాశీబుగ్గ: పలాస, మందస మండలాల పరిధిలో ఉన్నటువంటి వరిపంటను రైతులు కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. గత వారం రోజులుగా ఈదురు గాలులతో కురిసిన వర్షాలకు వరిచేలు నేలవాలడంతో పంట నష్టపోకుండా చర్యలు తీసుకుంటున్నారు. పలాస మండలంలోని సున్నాడ, తర్లాకోట, లొద్దభద్ర, రెంటికోట, కంట్రగడ, మందస మండలంలోని సందూరు, కిల్లోకి, కుల్లోగాం, జిల్లుండ తదితర ప్రాంతాల్లోని పొలాల్లో రైతులు బిజీబిజీగా గడుపుతున్నారు. అయితే మరో రెండు రోజుల్లో మరలా వాయుగుండం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించడంతో భయాందోళన చెందుతున్నారు. పంట చేతికందే సమయంలో ప్రకృతి వైపరీత్యాలు రావడంతో తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు.

తడిసిన ధాన్యం ఆరబోత

టెక్కలి: తుఫాన్ ప్రభావం కాస్త ఉపశమనం కలిగించడంతో టెక్కలి చుట్టుపక్కల గ్రామాల్లో రైతులంతా ధాన్యం ఎండబెట్టే పనిలో బిజీగా ఉన్నారు. పొలాల్లో ఉన్న కుప్పలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, కోత దశకు వచ్చిన చేనును యంత్రాలతో కోతకోసి వాటిని ఆరబెట్టడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు.